# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమరావతి పర్యటనపై ఏర్పాటయిన మంత్రివర్గ ఉప సంఘం ఈరోజు సమావేశమయ్యింది.
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు.
- పదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి.
- పోలవరం ప్రాజెక్టు పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి అయ్యేలా పనిచేస్తున్నామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు.
- వేసవి సెలవుల నేపధ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతిలో మే 2వ తేదీన పర్యటించనున్నారు. ఈ పర్యటన నేపధ్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఈరోజు నిర్వాహణ కమిటీతో సమావేశమయ్యింది. విజయవాడ ఇరిగేషన్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి ఎస్ విజయానంద్, నోడల్ అధికారి వీర పాండ్యన్, మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్ యాదవ్ ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి పర్యటన వివరాలను మంత్రులు వెల్లడిస్తూ... వచ్చే నెల 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ప్రధానమంత్రి అమరావతికి చేరుకుంటారని, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ జరగనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారని తెలిపారు. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రారంభిస్తారని తెలియజేశారు. బహిరంగ సభకు కనీసం 5 లక్షల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉందని, చుట్టుపక్కల జిల్లాల ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీ వెళ్ళి పలువురు కేంద్ర మంత్రులను కలువనున్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లిన ఆయన ఈరోజు రాత్రి 12 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసమయిన వన్ జన్ పథ్‌కు వెళ్లి బస చేయనున్నారు. రేపు ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టులపై వారితో చర్చించనున్నారు.

====================

తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు రాజమహేంద్రవరంలో పర్యటించారు. ఈరోజు మధ్యాహ్నం రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలోని అన్నా క్యాంటీన్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 250 అన్నా క్యాంటీన్ లను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు నిర్వహణ వల్ల ఆటో డ్రైవర్లు, కార్మికులు, విద్యార్థులు కేవలం 5 రూపాయలతో ఒక పూట ఆకలి తీర్చడం సాధ్యమయిందనీ మంత్రి పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి పోల్గొని పోలవరం పనుల పురోగతిని వివరించారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యేలా పనులు చేస్తున్నామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు తెలియజేస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

====================

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కించుమండ వద్ద 4 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సంపంగి వాగు వంతెనను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ… ఈ వంతెన ప్రారంభంతో కించుమండ గ్రామంతో పాటు మరో 16 గ్రామాలకు చెందిన సుమారు 3 వేల 500 మంది జనాభా రాకపోకలకు మార్గం సుగుమం అయిందన్నారు.

విరామం

====================

"పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" ద్వారా తిరుపతి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సౌరఫలకాలను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేయటానికి నారావారిపల్లె సమీపంలోని ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ మూడు పంచాయతీలలో మొత్తం 2 వేల 300 ఇళ్లపై సౌరపలకాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కందులవారిపల్లె పంచాయతీ నారావారిపల్లెలో అన్ని ఇళ్లకు సౌరపలకలు అమర్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నారావారిపల్లెకి చెందిన ఒక గ్రామస్తుడు ఆకాశవాణితో మాట్లాడుతూ…

(వాయిస్ 24 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి పరీక్షా ఫలితాలను ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ విడుదల చేయనున్నారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కే.వీ. శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫలితాలను సైతం విడుదల చేయనున్నామని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in తో పాటు ఇటీవల

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన మిత్ర' వాట్సప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే LEAP మొబైల్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు లాగిన్ అయి ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించినట్లు వెల్లడించారు.

====================

వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తూండటంతో శ్రీవారి దర్శనానికి గంటల సమయం పడుతోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు 7 కంపార్ట్మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనం కోసం దాదాపు 12 గంటల సమయం పడుతోంది. ఇక నిన్న వారాంతం కావడంతో తిరుమల శ్రీవారిని దాదాపు 25 వేల 078 మంది భక్తులు దర్శించుకున్నారు.

====================

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అన్ని చర్యలు చేపడుతున్నామని ఎన్.టి.ఆర్ జిల్లా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలిపారు. విజయవాడలో సురక్ష కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. నగరంలోని మహిళా పోలీస్ సిబ్బందికి ఉచితంగా గర్భస్థ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ మొదలైన 10 రకాల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ... ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ లో ప్రజల్లో ఒక భద్రతా భావాన్ని పెంపొందించడంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నగరంలో 3 వేల సి.సి.కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసుల దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, వారి ఆరోగ్య పరిరక్షణకై తప్పకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకుగానూ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని నగరంలోని మహిళా పోలీస్ సిబ్బంది అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

రాష్ట్రంలో రానున్న 4, 5 రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వేడి, ఉక్కపోత ప్రభావం ఉంటుందని వడగాలులు వీచే అవకాశం కూడా ఉంటుందని వాతావరణ కేంద్ర అధికారి వెల్లడిస్తూ ....

(వాయిస్ 26 సెకన్లు)

====================
====================